
సాక్షి ఒడిశా

శనివారం, 12, అక్టోబర్, 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 4,02,497
బంగారం : 1 గ్రాము 690 మిల్లీ గ్రాములు
వెండి : 4 గ్రాములు - భువనేశ్వర్/పూరీ



ఆనందం నిండుగ

దసరా పండుగ అన్ని కుటుంబాల్లో ఆనందాలు నింపాలని సీఎం ఆకాంక్షించారు. నగరంలో పలు దేవీ మండపాలను సందర్శించారు.

- 6లో



దంపతుల ఆత్మహత్య

కుటుంబ కలహాలతో బమునిపుట్ గ్రామంలో దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. వీరు గతేడాదే వివాహం చేసుకున్నారు.

- 6లో

న్యూస్‌రీల్

ఏనుగు దాడిలో వృద్ధురాలు మృతి

భువనేశ్వర్: కటక్ జిల్లాలో ఏనుగు దాడిలో వృద్ధురాలు మృతి చెందింది. అఠాగొడా మండలం గొబొరా పంచాయతీ రక్షిత అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. మృతురాలు క్షిరిఖియా గ్రామానికి చెందిన గుర్బారి తిరియాగా గుర్తించారు. అటవీ ప్రాంతంలో మేకల్ని మేపుతుండగా ఏనుగు దాడి చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. గురుడిజటియా పోలీస్‌స్టేషన్, అటవీ శాఖ పోలీసులు సంయుక్తంగా విచారణ చేపట్టారు.

బస్సు ఢీకొని మహిళా కానిస్టేబుల్ దుర్మరణం

భువనేశ్వర్: బస్సు ఢీకొన్న ఘటనలో మహిళా కానిస్టేబుల్ దుర్మరణం చెందింది. జగత్‌సింగ్‌పూర్ జిల్లా తిర్తోల్ ప్రాంతం శరణి కూడలిలో శుక్రవారం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. మృతురాలు తిర్తోల్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ సురూ జముడాగా గుర్తించారు.

ఖండగిరి కొండల్లో గుర్తు తెలియని మృతదేహం

భువనేశ్వర్: నగర శివారులోని ఖండగిరి కొండపాద ప్రాంతంలో గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యమైంది. క్రీడా దుస్తుల్లో ఉన్న ఈ యువకుడి శరీరంపై పలు గాయాలు ఉండటంతో ఎక్కడో చంపేసి ఇక్కడ పడేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. ఖండగిరి స్టేషన్ పోలీసులు మృతదేహాన్ని స్వాధీన పరచుకుని కేసు నమోదు చేశారు. పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాలను పరిశీలించనున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

విదేశీ మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో పోలీసులు

రాయగడ: ద్విచక్ర వాహనాల్లో అక్రమంగా విదేశీ మద్యాన్ని రవాణా చేస్తున్న ఇద్దరిని రామనగుడ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 560 లీటర్ల విదేశీ మద్యం బాటిళ్లు, 24 లీటర్ల బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో శత్రుఘన్ యాదవ్, చంద్రకాంత్ ముంభిరిక ఉన్నారు. గురువారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీ చేపడుతుండగా రెండు బైకులపై గోనె సంచిలో మద్యం తీసుకొస్తూ వీరు పట్టుబడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు తరలించారు.

ఐదుగురు జూదరుల అరెస్టు



అరెస్టయిన జూదరులు

రాయగడ: స్థానిక సువావీధిలో సదరు పోలీసులు గురువారం రాత్రి పేకాట శిబిరంపై దాడులు నిర్వహించారు. ఐదుగురు జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.15,340 నగదు స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టుకు తరలించారు. దసరా ఉత్సవాల సందర్భంగా జోరుగా పేకాటలు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.

చెరువులోకి దూసుకెళ్లిన కారు



రొయ్యల చెరువులో పడిన కారు

భువనేశ్వర్: రొయ్యల చెరువులోకి ఓ కారు దూసుకుపోయింది. అదృష్టవశాత్తూ ఎవరికీ ప్రాణాపాయం కలగలేదు. ఐదుగురు ప్రయాణికులతో ఖుర్దా నుంచి వెళ్తుండగా పూరీ జిల్లా అస్తరంగ్ పీర్ జహానియా వద్ద డ్రైవరు నిర్లక్ష్యం కారణంగా చెరువులోకి దూసుకెళ్లినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు పర్యాటకుల్ని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. వీరంతా స్వల్పంగా గాయపడ్డారు.

ట్రక్కు ఢీకొని ఆవులు మృతి

జయపురం: తెలిగుడలోని జాతీయ రహదారిలో గురువారం సాయంత్రం ట్రక్కు ఢీకొని రెండు ఆవులు మృతి చెందగా, ఓ దూడ తీవ్రంగా గాయపడింది. సమాచారం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడిన దూడను స్థానిక పశువుల ఆస్పత్రికి తరలించారు. పశువులు చెట్టు కింద సేద తీరుతుండగా ట్రక్కు ఢీకొని ఆగకుండా వెళ్లిపోయిందని పోలీసు అధికారి ఈశ్వరచంద్ర తండి శుక్రవారం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

జయజయ హే.. మహిషాసుర మర్దిని



దేవీ నవరాత్రి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. శుక్రవారం అమ్మవారు మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పలు ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొన్నిచోట్ల చండీయాగాలు చేశారు. వేడుకల్లో భాగంగా దాండియా నృత్యాలు, పలు సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.
– సాక్షి నెట్‌వర్క్



రాయగడ: కస్తూరినగర్‌లో మహిషాసుర మర్దినిగా లక్ష్మీ అమ్మవారు



రాయగడ: అంభొదలలో కొలువుదీరిన దుర్గాదేవి



రాయగడ: అంభొదలలో మహిళల దాండియా నృత్యాలు



భువనేశ్వర్: స్టేషన్‌బజారులో పూజలందుకుంటున్న దుర్గా దేవి



భువనేశ్వర్: సాహిద్‌నగర్‌లో పూజలందుకుంటున్న జగజ్జనని



పర్లాకిమిడి: కాలేజ్ జంక్షన్‌లో దుర్గాదేవి



పర్లాకిమిడి: నోడియా తుట్ట వీధిలో దుర్గామాత



పర్లాకిమిడి: చిత్రకారవీధి జంక్షన్‌లో శ్యామకాళీ రూపంలో..



భువనేశ్వర్: డొమొణా పూజా కమిటీ తోరణం



భువనేశ్వర్: సాహిద్‌నగర్‌లో ప్రత్యేక పెండాల్



భువనేశ్వర్: నయాపల్లిలో హరిద్వార్ ప్యాలెస్ నమూనా



రాయగడ: హనుమాన్ మందిరంలో చండీయాగం



మల్కన్‌గిరి: డీఎన్‌కే కూడలిలో దుర్గాదేవి



మల్కన్‌గిరి: దుర్గాదేవి మండపంలో ప్రత్యేక ఆకర్షణగా మహిళా రక్షణ విగ్రహాలు



మల్కన్‌గిరి: పక్షుల పెంపకం ఆవశ్యకత వివరిస్తూ..



మల్కన్‌గిరి: సుభాష్‌చంద్రబోస్ కూడలిలో మాదుర్గా విగ్రహం



జయపురం: మహిషాసుర మర్దినిగా మా భగవతి



జయపురం: మా భగవతి మందిరం నుంచి ఊరేగింపు



జయపురం: దసరా వేడుకల్లో పాల్గొనేందుకు విచ్చేసిన మా పెంద్రాని



జయపురం: పెంద్రాని దేవితో లాఠీలు



జయపురం: జయనగర్‌లో దుర్గాదేవి విగ్రహం



జయపురం:గాంధీ జంక్షన్‌లో దుర్గాదేవి విగ్రహం



జయపురం: మా భగవతి మందిరంలో ఆయుధ పూజ

ఆకతాయిల ఆటకట్టే 'శక్తి వాహిని'

భువనేశ్వర్: దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎక్కడా అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా కటక్, భువనేశ్వర్ నగరాల్లో 'శక్తి వాహిని' పేరిట జంట నగరాల పోలీసు కమిషనరేట్ ప్రత్యేక వ్యవస్థను రంగంలోకి దించింది. ప్రత్యేక మోటారు సైకిళ్లపై పహారా కాసే ఈ బృందం పిల్లలు, మహిళల భద్రతే లక్ష్యంగా పహారా కాస్తుందని పోలీస్ కమిషనర్ దేవ్ దత్త సింగ్ శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న మహిళా పోలీసు వ్యవస్థతో కలిసి శక్తి వాహిని అనుబంధ వ్యవస్థగా పని చేస్తుందని చెప్పారు. ఈ బృందానికి 20 మోటారు సైకిళ్లు కేటాయించామని, వీటిపై 40 మంది మహిళా పోలీసు సిబ్బంది శక్తి వాహిని పేరిట పహారా కాస్తారని తెలిపారు. పిల్లల అక్రమ రవాణా, గొలుసు దొంగతనాలు, జేబు దొంగతనాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తారని పేర్కొన్నారు. ముఖ్యంగా మందుబాబులు, ఆకతాయిల పట్ల ఈ బృందం కఠినంగా వ్యవహరిస్తుందని చెప్పారు. దుర్గా పూజా పందిళ్లు, జనసందోహిత ప్రాంతాల్లో శక్తి వాహిని వ్యూహాత్మకంగా పనిచేస్తుందన్నారు. నేరచరితుల కదలికపై దృష్టి సారిస్తుందన్నారు. దేవీ ఉత్సవాలు ఆనందోత్సాహాలతో ముగించే సంకల్పంతో శక్తి వాహిని ప్రవేశపెట్టినట్లు కమిషనర్ స్పష్టం చేశారు.



శక్తి వాహిని పహారా బృందం



మహిళా పోలీసు దళం

భక్తిశ్రద్ధలతో చండీయాగం



చండీయాగం నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి:

స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో శుక్రవారం మహర్నవమి సందర్భంగా పండితులు వనమాళి మణిశర్మ ఆధ్వర్యంలో నవచండీ యాగం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాతపట్నం గ్రామానికి చెందిన ఎరుకోల కృష్ణారావు, చంద్రకళ దంపతులు ఈ యాగాన్ని జరిపించారు. వ్యాపారి మోనంగి రమేష్, రమ్య దంపతులు లలితా త్రిపుర సుందరీదేవి విగ్రహాలను బహూకరించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



పాటలు పాడుతున్న కళాకారులు



ఉత్తమ కళాకారున్ని సన్మానిస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి

జయపురం: దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం రాత్రి రథొపాడియ కూడలి వద్ద నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ముందుగా ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి వేడుకలను ప్రారంభించారు. అనంతరం పలువురు కళాకారులు శ్రావ్యమైన సంగీతంతో మృదుమధుర పాటలతో శ్రోతలను మైమరపించారు. స్వరఘుర సంస్థ వ్యవస్థాపకులు ధీరెన్ మోహన పట్నాయిక్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆద్యంతం ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. అనంతరం ఉత్తమ కళాకారులను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, దేవేంద్ర బాహిణీపతి తదితరులు పాల్గొన్నారు.



సంగీతంతో ప్రేక్షకులను ఊర్రూతలూగిస్తున్న కళాకారులు



కార్యక్రమానికి హాజరైన స్థానికులు

న్యూస్‌రీల్

దసరాకు దూరం



నవరాత్రులకు నోచుకోని కొత్తూరు గ్రామం

కొత్తూరు: దేశం మొత్తం దసరా సరదాలో ఉంటే కొత్తూరులో మాత్రం దేవీ నవరాత్రులు జరుపుకోరు. దాదాపు వందేళ్లుగా వీరు దసరా జరుపుకోవడం లేదు. వందేళ్ల కిందట దసరాలో మేకను బలి ఇస్తున్నప్పుడు పొరపాటున ఓ వ్యక్తిపైకి కత్తి వెళ్లి ఆయన చనిపోవడంతో అప్పటి నుంచి నవరాత్రులు చేయడం మానేశారు. 1985లో ఓసారి అప్పటి యువకులంతా దేవీ నవరాత్రులు చేయడానికి ప్రయత్నిస్తే బాణసంచా పేలి ఒకరికి గాయాలయ్యాయి. దీంతో దసరా ఉత్సవాలకు దూరంగా ఉండిపోయారు. దసరా అనే కాదు.. గ్రామదేవతలకు చల్లదనం, పత్రి పూజలు చేయడం కూడా ఆపేశారు. విజయదశమి రోజు మాత్రం వాహనాలకు పూజలు చేస్తారు.

అల్లర్లకు పాల్పడవద్దు: ఎస్పీ



ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా ప్రజలకు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. పల్లెల్లో అమ్మవారికి కొమ్ములు వేసే సమయంలో వర్గాలుగా వీడి కొట్లాటకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల వారీగా, పట్టణాల వారీగా ఇప్పటికే తమ పోలీసుల వద్ద ఎవరెవరు అల్లర్లకు పాల్పడతారో వారి లిస్టు ఉందని, అలాంటి వారిపై పూర్తి నిఘా పెట్టి ఉంచామన్నారు.

వినియోగంలోనికి వచ్చిన స్కానింగ్ పరికరం



స్కానింగ్ మిషన్

నరసన్నపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో స్కానింగ్ మిషన్ ఎట్టకేలకు వినియోగంలోకి వచ్చింది. గురువారం సాయంత్రం సంబంధిత ఇంజినీరింగ్ ప్రతినిధి వచ్చి స్కానింగ్ మిషన్ మరమ్మతు చేశారు. శుక్రవారం నుంచి వినియోగిస్తున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనుబాబు తెలిపారు. 'ఆస్పత్రిలో పనిచేయని స్కానింగ్ మిషన్' అన్న శీర్షికతో సాక్షిలో గురువారం వార్త రావడంతో అధికారులు వెంటనే స్పందించి మరమ్మతు చేశారు.

పశువులు తరలిస్తున్న వాహనాల పట్టివేత



నెల్లిమర్ల : నెల్లిమర్ల పట్టణ పరిధిలో అక్రమంగా పశువులు తరలిస్తున్న రెండు వాహనాలను స్థానిక పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. రాజాం నుంచి నెల్లిమర్ల మీదుగా విజయనగరం వైపు వెళ్తున్న వాహనాలను ఎస్సై గణేష్, సిబ్బంది సీజ్ చేశారు. వాహనాల్లోని పశువులను గుర్ల గోశాలకు అప్పగించారు. వాహన చోదకులపై కేసు నమోదు చేశారు. అనుమతి లేకుండా పశువులను తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్సై హెచ్చరించారు.



దుర్గా పూజా పందిళ్ల సందర్శనలో విపక్ష నేత నవీన్ పట్నాయక్



సాహిద్‌నగర్‌లో దేవిని దర్శించుకున్న ముఖ్యమంత్రి మోహనచరణ్ దంపతులు

దసరా పండుగ.. ఆనందం నిండుగ

- ఉత్సవం ఉత్సాహభరితం కావాలి
- దేవిని దర్శించుకున్న సీఎం మోహన్‌చరణ్ మాఝి

భువనేశ్వర్:

దసరా పండుగ అన్ని కుటుంబాల్లో ఆనందాలు నింపాలని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులతో పాటు విపక్ష నేత నవీన్ పట్నాయక్ నగరంలోని పలు పూజా పందిళ్లు సందర్శించి దేవిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దసరా ఉత్సవాలు ఉత్సాహభరితంగా ముగియాలని ఆకాంక్షించారు. నగరవ్యాప్తంగా పూజా పందిళ్ల పరిసరాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు.

నిమజ్జనానికి కృత్రిమ కొలనులు..

దసరా ఉత్సవాల్లో భాగంగా నగర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో భారీ విగ్రహాలు పూజలు అందుకున్నాయి. ఉత్సవాల అనంతరం వీటిని నిమజ్జనం చేసేందుకు నగర పాలక సంస్థ బీఎంసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. నదులు, ఇతర జలాశయాల నీరు కలుషితం కాకుండా బీఎంసీ చర్యలు చేపట్టిందని మేయర్ సులోచన దాస్ తెలిపారు. నదీ తీరాలు, జలాశయాల ఒడ్డున దుర్గా దేవీ విగ్రహాలు నిమజ్జనం చేసేందుకు కృత్రిమ కొలనులు ఏర్పాటు చేశారు. ఇటీవల ముగిసిన గణపతి పూజల విగ్రహాలు, పూజా సామగ్రి నిమజ్జనం చేసేందుకు నగరంలో రెండు చోట్ల మాత్రమే కృత్రిమ కొలనులు ఏర్పాటు చేశారు. దుర్గా పూజలు పురస్కరించుకుని 5 చోట్ల ఇటువంటి కొలనులు ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. దీపావళి పురస్కరించుకుని కాళీ మాత, లక్ష్మీ దేవి పూజలు ముగిసేంత వరకు ఈ కొలనుల్ని బీఎంసీ నిర్వహిస్తుందని తెలిపారు. ఒక్కో కొలను ఏర్పాటుకు సుమారు రూ. 25 లక్షలు వరకు వెచ్చించినట్లు మేయర్ చెప్పారు. దేవీ ఉత్సవాల చివరి ఘట్టం వాన జల్లుతో మురిసింది. శుక్రవారం సాయంత్రం చిరజల్లుల నడుమే పలు ప్రాంగణాల్లో దేవిని దర్శించుకున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా అద్దె రద్దు..

దుర్గాదేవి పూజా పందిళ్ల సందర్శన పురస్కరించుకుని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి పూజా పందిళ్ల అద్దె రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ ఆదేశాలు రాష్ట్ర వ్యాప్తంగా వర్తిస్తాయని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి సతీమణి డాక్టర్ ప్రియాంక మరాండితో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



సైకత దుర్గ

పూరీ సాగరతీరంలో పలు రకాల సుగంధ పుష్పాలు, పండ్లతో సైకత దుర్గ పర్యాటకుల్ని విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రసిద్ధ సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ ఈ శిల్పం తీర్చిదిద్దారు. – భువనేశ్వర్

కుటుంబ కలహాలతో దంపతుల ఆత్మహత్య



సుకన, సుమిత్ర (ఫైల్)

జయపురం: కుటుంబ కలహాలతో బమునిపుట్ గ్రామంలో దంపతులు ఆత్మహత్య చేసుకున్నట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి శుక్రవారం వెల్లడించారు. గ్రామానికి చెందిన సుకన సౌర, సుమిత్ర సౌరలు గతేడాది వివాహం చేసుకున్నారు. వీరి మధ్య కొన్నాళ్లుగా కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం మరోసారి గొడవపడ్డారు. ముందుగా సుకన సౌర ఆత్మహత్య చేసుకోవడంతో అనంతరం సుమిత్ర సౌర కూడా ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు, క్లూస్‌టీం సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జయపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. దంపతుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసు అధికారి ఈశ్వర తండి తెలిపారు.



విషాదంలో బంధువులు

మాజీ ఎమ్మెల్యే నిరంజన్ మృతి



నిరంజన్ ప్రధాన్(ఫైల్)

భువనేశ్వర్: మాజీ ఎమ్మెల్యే నిరంజన్ ప్రధాన్ గురువారం మృతి చెందారు. గంజాం జిల్లా పొలొసారా నియోజక వర్గం నుంచి రాష్ట్ర శాసన సభకు ప్రాతినిధ్యం వహించిన ఈయన కొద్ది కాలంగా అనారోగ్యంతో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. బిజూ జనతా దళ్ అభ్యర్థిగా 2004లో కొదొలా నియోజకవర్గం, 2009లో పొలొసారా నియోజకవర్గం పోటీ చేసి గెలుపొందారు. 1979లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 1980లో మాజీ మంత్రి రామకృష్ణ పట్నాయక్ స్ఫూర్తితో గ్రామీణ రాజకీయాల్లో ప్రత్యక్ష పోటీకి తలపడ్డారు. తొలిసారిగా ఘుడొపొలాన్ పంచాయతీ సర్పంచ్‌గా విజయం సాధించారు. 1990 నుంచి 1993 వరకు పొలొసారా మండలం అధ్యక్షుడిగా కొనసాగారు. 1995లో కొదొలా నియోజకవర్గంలో రాజకీయ గురువు రామకృష్ణ పట్నాయక్‌పై స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2004లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కొదొలా నియోజకవర్గం నుంచి బిజూ జనతాదళ్ టికెట్‌తో పోటీ చేసి విజయం సాధించడంతో తొలిసారి రాష్ట్ర శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు. 2009లో కొత్తగా ఏర్పాటైన పొలొసారా నియోజకవర్గం నుంచి మరోసారి బీజేడీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. 2019లో బీజేడీ టికెట్ దక్కకపోవడంతో పార్టీకి రాజీనామా చేసి భారతీయ జనతా పార్టీలో చేరారు.

విద్యా సామర్థ్యాన్ని పెంచాలి ..

భోగాపురం:

నేటి బాలికల్లో విద్యా సామర్థ్యాన్ని పెంపొందించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ పీఓ ఎస్తేరురాణి తెలిపారు. మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భోగాపురం, సవరవిల్లి, చాకివలస, పోలిపల్లి, తదితర అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో ర్యాలీలు చేపట్టారు.



చాకివలసలో ర్యాలీ నిర్వహిస్తున్న బాలికలు

కోరలు చాస్తున్న కాలుష్యం..

- పది గ్రామాలలో భూగర్భ జలాలు కలుషితం
- తాగునీటికి తప్పని ఇక్కట్లు



కందివలసగెడ్డలో కలుషితమైన నీరు

పూసపాటిరేగ: జిల్లా సరిహద్దు గ్రామాలలో కాలుష్యం కోరలు చాస్తోంది. రసాయన పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థ జలాలతో భూగర్భ జలాలు కలుషితమై సుమారు 10 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలలో బోర్లు, నేల బావుల నీరు కలుషితం కావడంతో నిరుపయోగంగా మారుతున్నాయి. ఆయా గ్రామాలను ఆనుకుని ఉన్న కందివలసగెడ్డలోకి పరిశ్రమ వ్యర్థజలాలు వదలడంతో గెడ్డ కూడా కలుషితమైంది. దీంతో గెడ్డ నీరు తాగి ఎన్నో పశువులు మృత్యువాత పడుతున్నాయి. విజయనగరం జిల్లా సరిహద్దులలో ప్రవహిస్తున్న కందివలస గెడ్డను ఆనుకుని పూసపాటిరేగ మండలంలో పలు గ్రామాలున్నాయి. వాటిలో అల్లాడపాలెం, చౌడువాడ, కోనయ్యపాలెం, కొణతాలపాలెం, కనిమెల్ల, కామవరం, చింతపల్లి, కృష్ణాపురం, నీలగెడ్డపేట, లంకలపల్లిపాలెం, తదితర గ్రామాల్లోని సాగునీటి వనరుల్లోకి పరిశ్రమల వ్యర్థాలు కలిసిపోతుండడంతో నీరు కలుషితమవుతోంది. ప్రజలు రోగాల బారిన పడుతున్నా.. పశువులు మృత్యువాత పడుతున్నా కాలుష్య నియంత్రణ బోర్డు అధికారుల జాడ లేదు. జిల్లాకు శివారున ఉన్న గెడ్డలోకి రాత్రివేళల్లో పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలను విడిచిపెడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి, ప్రజలను కాలుష్యం బారి నుంచి కాపాడాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి..

గెడ్డలో వ్యర్థ జలాలను పరిశీలించి పీసీబీ అధికారులు చర్యలు తీసుకోవాలి. కాలుష్యం కోరలు చాస్తున్నా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు స్పందించడం లేదు. పరిశ్రమలు శ్రీకాకుళం జిల్లా సరిహద్దులో ఉంటే కాలుష్య కారకాలు మాత్రం విజయనగరం జిల్లా పరిధిలోకి రావడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

– ఎం. శ్రీనివాసరావు, పూసపాటిరేగ

ఇబ్బంది పడుతున్నాం..

కందివలస గెడ్డ కలుషితం కావడంతో ఇబ్బందులు తప్పడం లేదు. గెడ్డలో నీరు తాగిన పశువులు మృత్యువాత పడుతున్నాయి. పరిశ్రమల పైపైల నుంచి వ్యర్థాలను గెడ్డలోకి వదిలేస్తున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవాలు తెలుసుకుని, పరిశ్రమ యజమానులపై చర్యలు తీసుకోవాలి.

బి. సూర్యనారాయణ, పూసపాటిరేగ

చికెన్..చాలా రేటు గురూ!



- విశాఖ, విజయనగరం కంటే శ్రీకాకుళంలోనే అత్యధికం
- సిండికేట్ చేతిలో చికెన్ ధరలు
- అమ్మలేమంటున్న రిటైల్ వ్యాపారులు
- కష్టంగా మారిన హోటల్స్, హాస్టల్స్ నిర్వహణ



శ్రీకాకుళం/(పీఎన్ కాలనీ): సిండికేట్ల చేతిలో పడి చికెన్ ధరలు అడ్డూ అదుపు లేకుండా పెరిగిపోతున్నాయి. కూరగాయలు, ఆయిల్, నిత్యావసర సరుకుల ధరలు నిర్ణయించే అధికారం కలెక్టర్, మార్కెటింగ్‌శాఖ అధికారుల చేతుల్లో ఉంటుంది. చికెన్ ధరలు మాత్రం వారే రేట్లు 'ఫిక్స్' చేస్తారు. విశాఖపట్నం, విజయనగరంలో ఒక రేటు ఉంటే శ్రీకాకుళంలో మాత్రమే ఈ రెండు జిల్లాలకంటే రూ.20 ఎక్కువ ఉంటుంది. ఎందుకు ఎక్కువ అంటే ఎవరూ సమాధానం చెప్పలేరు. ఫారాలకు జిల్లాలోనే ఫీడ్ దొరుకుతుంది, కోళ్ల ఫారాలు సైతం జిల్లాలోనే ఉన్నాయి. జిల్లాకు సరిపడా సరుకు లేకుంటే విశాఖ, అనకాపల్లి నుంచి తీసుకువస్తారు. కానీ ధరలు మాత్రం విశాఖ, విజయనగరం కంటే ఎక్కువే ఉంటున్నాయి. ఈ సిండికేట్‌లో త్రిమూర్తుల్లా ముగ్గురు వ్యక్తులు ఈ వ్యవహారమంతా నడిపిస్తోన్నట్లు చికెన్ షాపుల యజమానులు గుసగుసలాడుకుంటున్నారు.

గత నాలుగు నెలలుగా స్కిన్‌లెస్ సుమారు రూ.260కి పైగా ధర పలుకుతోంది. విశాఖపట్నం, విజయనగరంలో రూ.240కి అమ్ముతున్నారు. ఇవి పత్రికల్లో వచ్చే ధరలు. చికెన్‌షాపుల యజమానుల వారి వ్యాపారాన్ని బట్టి ధర తగ్గించి అమ్మేవారు కొందరు, మరికొంతమంది దానికంటే ఎక్కువ ధరకు అమ్మకాలు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ/ప్రవేటు హాస్టల్స్, హోటల్స్, దాబాల నిర్వాహకులు కొనలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దసరా తర్వాత ఆదివారం ఇంకెంత ధర పెంచేస్తారోనని ఆందోళన చెందుతున్నారు.

ఒడిశా నుంచి కొని..

జిల్లాలోని పలువురు వ్యాపారులు ఒడిశా నుంచి కోళ్లను తక్కువ ధరకు తీసుకువస్తున్నారు. జిల్లాలో కంటే ఒడిశాలో ధర కిలోకు రూ.40వరకు తక్కువగానే ఉంటుంది. తక్కువ ధరకు కొనుగోలు చేసి జిల్లాలో వ్యాపారులు, సిండికేటుగాళ్లు ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. విశాఖ, విజయనగరం జిల్లాల కంటే తక్కువ ధరకు ఇవ్వాల్సింది పోయి తిరిగి దూర ప్రాంతాల నుంచి తెస్తున్నామనే నెపంతో ధరలు అధికంగా పెంచేసి రెట్టింపు లాభాల్ని ఆర్జిస్తున్నారు. ధరల నియంత్రణపై జిల్లా అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ధరలు నియంత్రించాల్సిందే



చికెన్ ధరల నియంత్రణ అధికారుల చేతుల్లో ఉంటే బాగుంటుంది. హోల్‌సేల్ వ్యాపారులు తమకు ఇష్టం వచ్చిన ధరకు విక్రయిస్తున్నారు.

– ప్రకాష్, చికెన్‌షాపు, రైతుబజారు రోడ్డు, శ్రీకాకుళం.

వ్యాపారాలు చేయలేకపోతున్నాం




చికెన్ ధరలను ఇష్టం వచ్చినట్లు పెంచుకుంటూ పోతున్నారు. చికెన్, గుడ్లు ధరలు పెంచడంతో దాబాకి వచ్చేవారికి అధిక ధరలకు ఆహారాన్ని అమ్మలేకపోతున్నాం నష్టాన్ని భరించలేకపోతున్నాం.

– ఎం.నాగభూషణ్, శ్రీలక్ష్మిదుర్గాదాబా, బలగరోడ్

ధరల నియంత్రణ మా చేతుల్లో లేదు

చికెన్, గుడ్ల ధరల నియంత్రణ మా చేతుల్లో ఉండదు. వాటి సంరక్షణ, పోషణకు సంబంధించిన ప్రోత్సాహమంతా పశు సంవర్థక శాఖ నుంచి ఉంటుంది. ధరల నియంత్రణకు జిల్లాలో సంబంధిత ప్రభుత్వ శాఖల తో కూడిన కమిటీ వేస్తే నియంత్రణ సాధ్యమయ్యే అవకాశం ఉంటుంది.

– రావిపల్లి మురళీధర్, పశుసంవర్థకశాఖ సంయుక్త సంచాలకులు,



బీహార్‌లో ఏర్పాటు చేసిన అతిపెద్ద మండపం (ఫైల్)

ఊరికో తీరున..

శ్రీకాకుళం కల్చరల్: దేశమంతా దసరా వేడుకల్లో మునిగితేలుతోంది. జిల్లా కేంద్రంలో ఇతర ప్రాంతాలకు చెందిన వారు కొందరు స్థిరపడ్డారు. ఇక్కడి పద్ధతికి అలవాటు పడుతూనే.. తమ సొంత ప్రాంతాల్లో దసరా వేడుక చేసుకునే తీరును వారు 'సాక్షి'కి వివరించారు.



మహిషాసుర మర్దిని

రాజస్థాన్: ఇక్కడ దసరాకు ఆంధ్రాలో ఇచ్చిన ప్రాధాన్యత ఉండదు. ఈ పండగ సమయంలో దాండియా నృత్యాలు చేస్తారు.

మహారాష్ట్ర: ఇక్కడ 10 రోజుల పాటు పండుగ జరుపుతారు. అయితే దుర్గా దేవి పూజలు చేస్తూ అంతా ఉపవాసాలు ఉంటారు. అలాగే రాత్రంతా రామాయణం, రామలీలాపై నృత్యాలు చేస్తారు. ఆఖరి రోజున రావణాసురుడు, కుంభకర్ణుడు, మేఘనాథుడి దిష్టి బొమ్మలను సుమారుగా 40 లేదా 50 అడుగుల ఎత్తుగలవి దీపావళి టపాసులతో తయారు చేసి ఊరికి దూరంగా పెద్ద మైదానంలో ఉంచుతారు. అక్కడి లక్షలాది మంది జనాలు చేరాక రాముడు తన బాణంతో సంహరించినట్లుగా బాణంతో ఆ బొమ్మలను కాల్చుతారు. రావణుడిపై రాముడి విజయంగా భావించి విజయదశమిగా అక్కడ నమ్ముతారు.

కేరళ: కేరళలో దసరాకు సరస్వతీ మాతను ఆరాధిస్తారు. బలులు ఉండవు. అంతా సామరస్యంగా సాగుతాయి. రోజుకో అవతారంలో అలంకరించి కుంకుమ పూజలు నిర్వహిస్తారు.

ఒడిశా: దసరా సమయంలో కటక్, బరంపూర్‌లో సుమారు 200 వరకు మండపాలు (పెండాల) ఏర్పాటు చేస్తారు. ప్రతి ఇంటిలో నిష్టగా పూజలు జరుగుతాయి. వివిధ వేషధారణ బొమ్మలను ప్రతి ప్రదేశంలో ఏర్పాటు చేస్తారు. వాటిని చూసేందుకు ఇతర రాష్ట్రాలనుంచి తండోపతండాలుగా వస్తుంటారు.

దసరాకు ఎంతో ప్రాధాన్యం



పశ్చిమ బెంగాల్ తర్వాత ఒడిశాలో దసరా బాగా చేస్తారు. ప్రతి వీధిలో మండపాలు ఏర్పాటు చేస్తారు. ఊరంతా సందడిగా ఉంటుంది.

– నరసింహ పాణిగ్రాహి పండా, ఒడిశా రాష్ట్రం (శ్రీకాకుళం)

ఆహార నియమాలు ఉండవు



దసరా పండుగకు ఇక్కడ ఉన్నట్లుగా ఆహార నియమాలు మా ఊరిలో ఉండవు. నా చిన్నతనంలో మా గ్రామానికి దగ్గరగా ఉన్న మా తాతగారి ఊరైన రాంచీ వెళ్లి చూసే వాళ్లం. అక్కడ 200 మండపాలు (పెండాల్స్) అతి పెద్దవి ఏర్పాటు చేస్తారు. పెద్ద మైదానంలో ఒక ఎగ్జిబిషన్ మాదిరిగా పెడతారు. వాటి చూసేందుకు సాయంత్రం బయలు దేరితే రాత్రి ఒంటిగంట వరకు తిరిగేవాళ్లం. ఆఖరి రోజున పెద్ద మైదానంలో రావణ సంహారం పెడతారు. చిన్నారులకు రామలక్ష్మణ వేషధారణలు వేస్తారు.

– డాక్టర్ వికాస్(జార్ఖండ్), రాగోలు

భారీ డెకరేషన్స్ చేస్తారు



బీహార్‌లో భారీగా డెకరేషన్స్ చేస్తారు. మండపాల్లో మహిషాసుర మర్దని, దుర్గాదేవి, గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేస్తారు. ప్రతి రోజు సాయంత్రం అమ్మవారికి ధూపం హారతి ఇస్తారు. ఆ సమయంలో డప్పుల మోతలు ఉంటాయి.

– మధిర భాస్కర్ (బీహార్), బలగ

ఆంధ్రాలో బాగా జరుగుతాయి



తమిళనాడులో దసరాలో సరస్వతీ పూజలు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా బొమ్మల కొలువులు ఏర్పాటు చేస్తాము.

– సుబ్రహ్మణ్య కదిరేశన్ తమిళనాడు

క్లుప్తంగా

బాలికలకు భరోసానిద్దాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: బాలికలకు సామాజికంగా, ఆర్థికంగా మానసికంగా భరోసా ఇవ్వాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పిలుపునిచ్చారు. జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్అండ్బీ జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలకు అన్ని విధాలా అండగా ఉంటామని, వారికి మంచి భవిష్యత్తు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లా యంత్రాంగం తరఫున సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు మాట్లాడుతూ బాలికల సంరక్షణ, సామాజిక బాధ్యత అన్నారు. వారిపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాలికలకు రక్షణ కల్పించడంతో పాటు వారికి చక్కని చదువు, ఆరోగ్యం అందించాలన్నారు. వారి సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ కమిటీ చైర్పర్సన్ హిమబిందు, ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి, డీసీపీయూ యాళ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

గుర్ల: మండలంలోని పెద్దబంటుపల్లి శివారు ప్రాంతంలోని తోటలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పట్టుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్సై పి.నారాయణ రావు శుక్రవారం తెలిపారు. పట్టుకున్న జూదరుల నుంచి రూ.6210 నగదు సీజ్ చేసి కేసు నమోదు చేశామని చెప్పారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినవారి సమాచారం అందిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



రామారావు మృతదేహం

బాడంగి: మండలంలోని వీరసాగరం గ్రామంలో చప్పరామారావు అనే వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం రాత్రి జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బొబ్బిలి పట్టణానికి చెందిన చప్పరామారావు తన అత్తవారింటికని బాడంగి మండలంలోని వీరసాగరం గ్రామానికి వచ్చి భార్యతో గొడవపడి మనస్తాపం చెందడంతో ఊరి బయటకు వెళ్లి పురుగు మందు తాగేశాడు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు హుటాహుటిన బాడంగి సీహెచ్సీకి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరంలోని కేంద్రాస్పత్రికి తీసుకువెళ్లగా అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. రామారావు ప్రైవేట్గా విద్యుత్ పనులు చేసేవాడు. మృతునికి భార్య మంగ, ఇద్దరుపిల్లలున్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై తారకేశ్వరరావు శుక్రవారం కేసు నమోదుచేసి పోస్టుమార్టం నిర్వహించి అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

దసరా పండగకు వచ్చి బాలుడి మృతువాత

గుర్ల: దసరా పండగ సెలవులకు సరదాగా వచ్చిన బాలుడు బొలెరో వాహనం ఢీకొని మృతువాత పడ్డాడు. గుర్ల మండలంలోని పాలవలసలో శుక్రవారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. పాలవలసకు చెందిన చిన్నారి చింతపల్లి షణ్ముఖ తల్లిదండ్రులు విశాఖపట్నంలో కూలి పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. దసరా సెలవులు తాతతో సరదాగా గుడుపుదామని గ్రామానికి వచ్చిన చిన్నారి షణ్ముఖ గ్రామంలోని పిల్లలతో కలిసి కళ్లాల వద్ద అడుతుండగా పక్కన ఉన్న బొలెరో వాహనం వెనక నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిన్నారి తలకు తీవ్ర గాయాలు కాగా ప్రథమ చికిత్సను గుర్ల పీహెచ్సీలో చేయంచి మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రానికి 108లో తరలించారు. అక్కడ చికిత్స అందిస్తుండగా మృతిచెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ప్రమాదంపై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నారాయణ రావు తెలిపారు.

డీఎస్సీ శిక్షణ ఎంపిక పరీక్ష రద్దు

సీతంపేట: గిరిజన నిరుద్యోగులకు ఐటీడీఏ ఆధ్వర్యంలో డీఎస్సీ శిక్షణ ఇచ్చేందుకు ఆగస్టు 22న వైటీసీలో నిర్వహించిన ఎంపిక పరీక్షను రద్దుచేసినట్టు ఐటీడీఏ పీఓ యశ్వంత్కుమార్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఎస్సీ-2024 పరీక్షకు ఉచిత శిక్షణకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల ఎంపిక కోసం రాష్ట్రస్థాయిలో నిర్వహించే పరీక్షకు ఆన్లైన్ na na bh umi po-rt-al లో ఈనెల 21వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. హాల్ టికెట్లు 22 నుంచి డౌన్లోడ్ చేసుకుని, 27న అభ్యర్థి ఎంపిక చేసుకున్న సెంటర్లో ఆన్లైన్ పరీక్షకు హాజరు కావాలన్నారు. టెట్పరీక్ష ఉత్తీర్ణత చెంది ఉండాలన్నారు.

దాబాల్లో దొంగ వ్యాపారాలు?

- మాదక ద్రవ్యాల రవాణాకు సహకారం
- సరిహద్దులో ఒడిశా, ఛత్తీస్గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు
- మాదక ద్రవ్యాల తరలింపునకు సులభమార్గం



నల్లమందు వ్యాపారం చేసింది ఈ దాబాలోనే

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట రూట్లో ఉన్న దాబాలు అక్రమ వ్యాపారాలకు అడ్డాగా మారుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి బతుకుతెరువు కోసం వచ్చిన దాబా యజమానులు బయటకు ఫుడ్ వ్యాపారం,లోపల అక్రమ వ్యాపారాలు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.ఇటీవల రామభద్రపురం మండలంలోని ముచ్చర్లవలస పరిధిలో గల పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న రాజస్థాన్ దాబా వద్ద ఆ దాబా యజమాని నల్లమందు విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడడమే ఇందుకు నిదర్శనం. గతంలో ఈ మండల పరిసర ప్రాంతంలో గంజాయి, గుట్కా, ఖైనీ వంటి మాదక ద్రవ్యాలు అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన సంఘటనలు ఉన్నాయి. కానీ ఇప్పుడు నల్లమందు కూడా సరఫరా చేస్తూ పట్టుబడడం ఇదే మొదటసారి. రామభద్రపురం మండలం ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్గఢ్ వంటి రాష్ట్రాలకు సరిహద్దులో ఉన్నందున ఈ మండలం మీదుగా మాదక ద్రవ్యాల అక్రమ రవాణా సులభతరమవుతుందని పలువురు చెబుతున్నారు. గతంలో స్థానిక పోలీసులు గంజాయి, గుట్కా, ఖైనీ వంటి మత్తు పదార్థాలు పట్టుకున్న ఘటనలు కోకొల్లలు ఉన్నాయి. అయితే ఈ నల్లమందు విక్రయానికి పాల్పడిన రాజస్థానీయుడు ఆ రాష్ట్రంలోని బర్మార్ జిల్లా, మండలి మండలం,కోర్డా గ్రామానికి చెందిన రాజేష్ చౌదరి అలియాస్ రాజేష్. రాజస్థాన్ నుంచి నల్లమందు తీసుకొచ్చి ఆ దాబాకు వచ్చిన లారీ డ్రైవర్లకు సరఫరా చేస్తున్నాడు. అలాగే ఆరికతోట సమీపంలో మరో దాబాలో కూడా అక్రమ వ్యాపారం జరుగుతున్నట్లు తెలిసింది. అక్కడ రాత్రి వేళల్లో లారీ డ్రైవర్లు, దాబా యజమాని ఒక్కటైపోయి లారీల్లో వస్తున్న ఐరన్, సిమ్మెంట్ వంటివి ఎంతో కొంత దింపేసి అక్రమ వ్యాపారం చేస్తున్నారని సమాచారం. జీఎస్టీ లేకుండా తక్కువ ధరలకు విక్రయిస్తున్నారని తెలిసింది. ఇలా దాబా యజమానులు అక్రమ వ్యాపారాలు చేస్తున్నారని పలువురు ఆరోపణలు చేస్తున్నారు. అయితే అక్రమాలకు పాల్పడి పోలీసులకు పట్టుబడిన వ్యక్తులపై కేసు నమోదుచేయకుండా టీడీపీ నాయకులు ఒత్తిళ్లు తెస్తున్నట్లు తెలిసింది. ఇటీవల నల్ల మందుతో పట్టుబడిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేయగా వెంటనే మండలకేంద్రంలో విద్యుత్ సరుకుల వ్యాపారం చేస్తున్న రాజస్థాన్కు చెందిన వ్యాపారికి స్నేహితుడు, అత్యంత ప్రీతిపాత్రుడు ఇప్పుడిప్పుడే మండల టీడీపీ నాయకుడుగా చలామణి అవుతున్న వ్యక్తి ఆ వ్యాపారితో కలిసి పోలీస్ స్టేషన్కు వెళ్లి నల్లమందుతో దొరికిన నిందితుడిపై కేసు నమోదు చేయకుండా వదిలేయాలని పోలీసులపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. డీడీపీకి చెందిన ఆ వ్యక్తి పలు సెటిల్మెంట్లు చేస్తున్నాడని తెలుస్తోంది. అయితే పోలీసులు వారి ఒత్తిళ్లకు లొంగకుండా కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్కు తరలించారు. అలాగే గతంలో ఎప్పుడు లేని నల్లమందు ఎక్కడిని నుంచి తెస్తున్నారు? దీని వెనుక ఇంకా ఎవరైనా ముఠా ఉందా అని దర్యాప్తు చేస్తున్నారు.



ఆరికతోట సమీపంలో ఉన్న దాబా వద్ద ఆగి ఉన్న ఐరన్ లోడు లారీ

అక్రమ వ్యాపారాలపై గట్టి నిఘా



మండలంలో జరుగుతున్న అక్రమ వ్యాపారాలపై గట్టి నిఘా పెట్టాం. అక్రమ వ్యాపారాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసు కుంటామని దాబా యజమానులను హెచ్చరించాం. మండలం సరిహద్దులో ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్గఢ్ వంటి ఏజెన్సీ రాష్ట్రాలు ఉడడం వల్ల. మండలం మీదుగా అక్రమ రవాణా జరిగే ఆస్కారం ఉంది. అక్రమ రవాణాపై నిఘా పెంచి, నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం.

నారాయణరావు, సీఐ, బొబ్బిలి రూరల్

సంప్రదాయ బద్ధంగా సిరిమానోత్సవం జరగాలి

- శాంతిభద్రతలకు విఘాతం కలగకూడదు
- కలెక్టర్ డా.బీఆర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: విజయనగరం ప్రజల ఇలవేల్పు, ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం అన్ని సంప్రదాయాలను పాటిస్తూ భక్తుల మనోభావాలకు తగ్గట్టుగా నిర్వహించాలని కలెక్టర్ డా.బీఆర్.అంబేడ్కర్ స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తన చాంబర్లో అమ్మవారి పండగ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి సిరిమానోత్సవాన్ని 15 వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకే కచ్చితంగా ప్రారంభించాలని, 5 గంటలకు పూర్తి చేయాలని ఆదేశించారు. సిరిమాను వద్ద పని చేసే సిబ్బంది అందరూ నిర్ణీత సమయానికి సిరిమాను ప్రారంభమయ్యేలా ముందుగానే ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అటవీ శాఖాధికారులు, ఆర్డీఓలు దగ్గరే ఉండి పర్యవేక్షించాలని ఆదేశించారు. తొక్కిసలాట జరగకుండా సిరిమాను వద్ద అందుకు సంబంధించిన వారు తప్ప ఇతరులు లేకుండా రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అమ్మవారి దర్శనాలకు మంత్రులు స్థాయి వీఐపీలు వచ్చేటప్పుడు తప్ప సాధారణ భక్తులకు ఇబ్బంది కలిగేలా క్యూలు నిలుపుదల చేయవద్దని, అందరికీ త్వరగా దర్శనమయ్యేలా చూడాలని చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణ క్రమ పద్ధతిలో ఉండాలని, శాంతి భద్రతలను దృష్టిలో పెట్టుకుని పోలీస్ అధికారులు జాగ్రత్త వహించాలని ఆదేశించారు.

ప్రసాదాలు తనిఖీ చేయాలి

అమ్మవారి ప్రసాదాలు అందరికీ సరిపడేలా తయారు చేసుకోవాలని, ప్రసాదాలను, అలాగే భక్తులకు క్యూలో ఇచ్చే మజ్జిగ, ఉచిత ప్రసాదాలు, తాగునీటిని కూడా ఫుడ్ ఇన్స్పెక్టర్ తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో జేసీ సేతు మాధవన్, డీఆర్ఓ అనిత, ఆర్డీఓ కీర్తి, డీఎస్పీ శ్రీనివాస రావు, ఈఓ ప్రసాద రావు, ఆర్అండ్బీ ఎస్ఈ కాంతిమతి, మన్సాస్ ఈఓ, పైడితల్లి అమ్మవారి ఆలయ ప్రధాన పూజారి తదితరులు పాల్గొన్నారు.

దళిత బహుజన సేవా సంఘం ఉపాధ్యక్షుడిగా కామేశ్వర రావు



కామేశ్వరరావు

బలిజిపేట: ఏపీ రాష్ట్ర దళిత బహుజన సేవా సంఘం ఉపాధ్యక్షుడిగా బలిజిపేట మండలంలోని గలావల్లి గ్రామానికి చెందిన నల్లబారిక కామేశ్వర రావు నియమితులయ్యారు. ఈ మేరక శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర సంఘం అధ్యక్షుడు సీహెచ్.సూర్యం చేతులమీదుగా నియామక పత్రాన్ని అందుకున్నట్లు తెలిపారు. దళిత బహుజనులందరినీ అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఈ సందర్భంగా కామేశ్వరరావు స్పష్టం చేశారు. తాను రెండు సంవత్సరాలు పదవీకాలంలో ఉంటానని దానిని సద్వినియోగం చేసుకుని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని తెలియజేశారు.

బంగారం చోరీ కేసులో నిందితుల అరెస్టు



చోరీ కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

బొండపల్లి: గత నెల 14 వతేదీ అర్ధరాత్రి బొండపల్లి మండలంలోని గొట్లాం గ్రామంలో గల సిద్ధి వినాయక జ్యూయలరీ షాపులో బంగారు ఆభరణాల చోరీకి సంబంధించిన కేసులో ఇద్దరు నిందితులను అదుపులోనికి తీసుకుని అరెస్టు చేసి రిమాండ్కు తరలించినట్లు బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాస రావు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి శుక్రవారం ఆయన బొండపల్లి పోలీస్స్టేషన్లో వివరాలు వెల్లడించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గునా జిల్లా సింగ్వ్యాసా గ్రామానికి చెందిన అజయ్ పార్ధీతో పాటు అదే ప్రాంతానికి చెందిన సుల్తానా మోగియా పార్ధీ, మరో నలుగురు వ్యక్తులు కలిసి దుకాణంలో చోరీకి పాల్పడి ఆర తులం బంగారం వస్తువులతో పాటు,10 కేజీలు వెండి ఆభరణాలు అపహరించారు. ప్రధాన నిందితులు ఇద్దరిని ఈనెల 11 న ఉదయం పదిన్నర గంటల సమయంలో నెలివాడ జంక్షన్ వద్ద అనుమానస్పదంగా తిరుగుతుండగా పట్టుకుని విచారణ చేయగా విషయాలన్నీ వెలుగులోనికి వచ్చాయని డీఎస్పీ చెప్పారు.

మిగిలిన నిందితుల కోసం గాలింపు

ఈ చోరీ కేసులో మిగిలిన మరో నలుగురు నిందితులు వివేక్ పార్ధీ, చూరమ్ పార్ధీ, పురం పార్ధీ, సచిన్ పార్ధీలను అరెస్టు చేయాల్సి ఉందని, అలాగే నిందితుల నుంచి ఆభరణాలు కొనుగోలు చేసిన ఆదే రాష్ట్రంలోని శైతేంద్ర సోనిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు. మిగతా నిందితుల కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. నిందితుల నుంచి అరకేజీ వెండి వస్తువులతో పాటు, రూ.వెయ్యి నగదు, చోరీకి ఉపయోగించిన వస్తువులను ఈ సందర్భంగా స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఈ కేసు త్వరగా పరిష్కారమయ్యేందుకు కృషి చేసిన బొండపల్లి ఎస్సై యు.మహేష్తో పాటు సీసీఎస్ ఎస్సై ఎ.సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది ఇమ్రాన్ఖాన్, డి.శంకర్రావు, టి.అప్పలనాయుడు, ఆర్బీ నాయుడు, బి.రవికుమార్లను ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించడంతో రివార్డులు కూడా ప్రకటించినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో గజపతినగరం సీఐ జీఏవీ రమణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా



వెండి పతకంతో బెల్లాన భార్గవి | వెండి పతకంతో బి.చంద్రిక | కాంస్య పతకంతో దినేష్ కుమార్ | కాంస్య పతకంతో అనిల్ కుమార్ | వెండి పతకంతో బి.హారిక

నెల్లిమర్ల రూరల్: హిమాచల్ ప్రదేశ్లోని నగ్రోట భగవాన్లో ఈ నెల 6 నుంచి జరుగుతున్న ఐడబ్ల్యూఎల్ఎఫ్ జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో నెల్లిమర్ల మండలానికి చెందిన పలువురు క్రీడాకారులు సత్తా చాటారు. 49 కేజీల జూనియర్ విభాగంలో బెల్లాన భార్గవి స్నాచ్లో 68 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్ 86 కిలోల చొప్పున మొత్తం 154 కిలోల బరువును ఎత్తి వెండి పతకాన్ని కైవసం చేసుకుంది. అదే విభాగంలో నెల్లిమర్లకు చెందిన బి.చంద్రిక స్నాచ్లో 71కిలోలు, క్లీన్ అండ్ జెర్క్లో 92 కిలోలు చొప్పున మొత్తం 163 కిలోల బరువును ఎత్తి వెండి పతకాన్ని దక్కించుకుంది. 68 కిలోల సబ్ జూనియర్ విభాగంలో కె.దినేష్ కుమార్ స్నాచ్లో 117 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్లో 138 కిలోలు చొప్పున మొత్తం 255 కిలోల బరువును ఎత్తి కాంస్య పతకాన్ని సాధించాడు. 73 కిలోల విభాగంలో చంద్రంపేటకు చెందిన అనిల్ కుమార్ స్నాచ్లో 117, క్లీన్ అండ్ జెర్క్లో 156 కిలోలు చొప్పున 274 కిలోల బరువును ఎత్తి కాంస్య పతకం సాధించాడు. 64కిలోల సబ్ జూనియర్ విభాగంలో కొండవెలగాడకు చెందిన బెల్లాన హారిక స్నాచ్లో 78కిలోలు, క్లీన్ అండ్ జెర్క్లో 101 కిలోల చొప్పున మొత్తంగా 179 కిలోల బరువును ఎత్తి వెండి పతకాన్ని కైవసం చేసుకుంది. జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటిన వెయిట్ లిఫ్టర్లకు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు, తోటి క్రీడాకారులు అభినందనలు తెలియజేశారు.

గంజాయి పీలుస్తున్న ముగ్గురి అరెస్టు

- 200 గ్రామల గంజాయి, 3 సెల్ఫోన్లు స్వాధీనం



పట్టుబడిన నిందితులతో సీఐ రామకృష్ణ, ఎస్సై సన్యాసినాయుడు, తదితరులు

డెంకాడ: మండలంలోని నాతవలస టోల్గేట్ సమీపంలో చెరువు గట్టు వద్ద శుక్రవారం గంజాయి పీలుస్తున్న ముగ్గురు యువకులను డెంకాడ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ వకుల్జిందాల్ తెలిపారు. వారి నుంచి 200 గ్రాముల గంజాయి, మూడు సెల్ఫోన్లు స్వా ధీనం చేసుకున్నారని చెప్పారు. అరెస్టు చేసిన ముగ్గు నిందితులు విశాఖపట్నం సిటీకి చెందిన (ఎ-1) గంటా చిరంజీవి, (ఎ-2) గోరిజిలి డానియల్ రాజ్, (ఎ-3)గా చిన్ని సుమంత్లు అని చెప్పారు. ఈ కేసులో పట్టుబడిన వారికి గంజాయి సరఫరా చేసిందెవరనే సమాచారం రాబట్టామని, ఆ నిందితుడిని కూడా త్వరలో అరెస్టు చేస్తామన్నారు. ఈ కేసులో క్రియాశీలకంగా పనిచేసిన భోగాపురం సీఐ జి.రామకృష్ణ, డెంకాడ ఎస్సై సన్యాసినాయుడు, సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.

సౌత్ జోన్ అథ్లెటిక్స్ విజేతగా తులసి



మెడల్, సర్టిఫికెట్తో క్రీడాకారిణి తులసి

పాలకొండ రూరల్: పట్టణంలోని కేశవసాయి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ (బైపీసీ) ప్రథమ సంవత్సరం చదువుతున్న ఎస్.తులసి సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు కళాశాల యాజమాన్యం సదరు క్రీడాకారిణిని శుక్రవారం అభినందించింది. ఈ సందర్భంగా యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ ఈనెల 4వ తేదీ నుంచి రాజమండ్రిలోని ఆర్ట్స్ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన సౌత్జోన్ రేస్వాల్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థిని సత్తా చాటిందని తెలిపారు. సహచర విద్యార్థులు ఆమెను ఆదర్శంగా తీసుకుని చదువుతో పాటు క్రీడల్లో ఉత్సుకత చూపాలని కళాశాల యాజమాన్యం కోరింది.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ తదితరులు

రాజాం సిటీ: పట్టణ పరిధి బాబానగర్ మూడోలైన్కు చెందిన బత్తుల యశోద (62) అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఈ ఘటనకు సంబంధించి సీఐ కె.అశోక్కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గురువారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న యశోద శుక్రవారం ఉదయం ఎంతసేపటికీ లేవలేదు. దీంతో ఆమెను పరిశీలించిన కుటుంబసభ్యులు, స్థానికులు మృతిచెందినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ మృతదేహాన్ని పరిశీలించారు. ఆమె మెడలో ఉన్న బంగారం అపహరణకు గురైనట్లు కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. వృద్ధురాలి మృతిపై ఆమె కుమారుడు గిరీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

కలెక్టర్ను కలిసిన జాతీయ పర్యవేక్షణ బృందం



కలెక్టర్ను కలిసిన బృంద సభ్యులు

పార్వతీపురం: కేరళ నుంచి వచ్చిన జాతీయస్థాయి పర్యవేక్షణ బృంద సభ్యులు కలెక్టర్ ఎ.శ్యామ్ప్రసాద్ను కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. గత 8 రోజులుగా జిల్లాలోని 11 పంచాయతీలను సందర్శించి కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి అభిప్రాయాలను సేకరించారు. పర్యవేక్షణలో బృంద సభ్యులకు జిల్లా యంత్రాంగం సహాయ సహకారాలు అందించినందుకు కలెక్టర్కు కృతజ్ఞతలు తెలిపారు. వారి వెంట డ్వామా పీడీ కె.రామచంద్రరావు ఉన్నారు.

21న చలో సీతంపేట ఐటీడీఏ



మాట్లాడుతున్న గిరిజన సంఘ నాయకుడు లక్ష్మణరావు

సీతంపేట: మన్యంలో తాగు నీటి సమస్యను పరిష్కరించాలని, జీఓ నంబర్ 3కి చట్టబద్ధత కల్పించాలని, ఆదివాసీలకు స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలని, గిరిజన ప్రాంతాల్లో రోడ్ల సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతూ ఈ నెల 21న తలపెట్టిన చలో సీతంపేట ఐటీడీఏ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.లక్ష్మణరావు పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గిరిజనులతో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా ప్రజల సమస్యల పరిష్కారంపైన, అభివృద్ధిపై దృష్టిసారించడంలేదన్నారు. కేవలం మద్యం మీద మాత్రమే ఫోకస్పెట్టిందని విమర్శించారు. ధర్నాలో ఐటీడీఏ పరిధిలోని గిరిజనులందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు బి.అప్పారావు, జె.శ్రీరాములు పాల్గొన్నారు.

ఆకట్టుకునేలా అమ్మవారి వర్ణచిత్రం



గరుగుబిల్లి: దసరా నవరాత్రి మహోత్సవంలో భాగంగా గరుగుబిల్లి మండలం నాగూరుకు చెందిన నఖచిత్రకారుడు పల్ల పరిసినాయుడు మహిషాసురమర్ధిని వర్ణచిత్రం వేసి అందరినీ అబ్బురపరిచారు. ప్రత్యేక పర్వదినాలలో నఖ, వర్ణ చిత్రాలను వేసి ఈ ప్రాంతీయుల మన్ననలను పొందుతున్నారు.

దుర్గాదేవిని దర్శించుకున్న ఢిల్లీ హైకోర్టు జడ్జి

వంగర: మండల పరిధి రుషింగి గ్రామంలోని దుర్గాదేవి ఆలయాన్ని ఢిల్లీ హైకోర్టు జడ్జి గేదెల తుషార్రావు దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కుంకుమార్చన, ప్రత్యేక పూజలు జరిపించారు. అమ్మవారి ఆశీర్వచనాలు అందజేశారు. దసరా ఉత్సవాల్లో అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని తుషార్రావు తెలిపారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయవాది, ఆలయ ధర్మకర్త యలకల రాజగోపాలరావు దంపతులు పాల్గొన్నారు.

పీటీసీ ప్రిన్సిపాల్గా రామచంద్రరాజు

విజయనగరం క్రైమ్: అదనపు ఎస్పీల పదోన్నతిలో భాగంగా విజయనగరం జిల్లా పీటీసీ ప్రిన్సిపాల్గా పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ డి.రామచంద్రరాజు రానున్నారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన టి.ఆనందబాబును విజయవాడ హోంగార్డ్ కమాండెంట్గా బదిలీ చేస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

గ్రీవెన్స్ సెల్ రద్దు

విజయనగరం క్రైమ్: జిల్లాలో ఈ నెల 13, 14, 15 తేదీల్లో విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి అమ్మవారి తొలేళ్ల సంబరం, సిరిమానోత్సవాన్ని పురస్కరించుకుని అక్టోబర్ 14న సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించాల్సిన గ్రీవెన్స్సెల్ను రద్దు చేసినట్టు ఎస్పీ వకుల్ జిందల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

అందరికీ విజయాన్ని అందించాలి

విజయనగరం టౌన్: జిల్లా ప్రజలందరికీ విజయదశమి అన్నివిధాలా శుభాన్ని కలుగజేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆకాంక్షించారు. చెడుపై మంచి విజయానికి ప్రతీకగా దసరా పండగ నిర్వహిస్తారని, ఈ పండగ అందరికీ విజయాన్ని అందించాలంటూ దసరా శుభాకాంక్షలు తెలిపారు.

నిత్యావసరాల ధరలు అదుపులో ఉంచేందుకు చర్యలు

- మంత్రి శ్రీనివాస్



నూనె ప్యాకెట్ను మహిళకు అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్

విజయనగరం ఫోర్ట్: నిత్యావసర వస్తువుల ధరలు అదుపులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆర్అండ్బీ రైతు బజార్లో శుక్రవారం వంట నూనెల అమ్మకం కేంద్రాన్ని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మార్కెట్లో ధరలు అధికంగా ఉన్నందున రాయితీపై పామాయిల్, రిఫైండ్ ఆయిల్, టమాటోలు అందిస్తున్నామని తెలిపారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో రాయితీపై నిత్యావసర వస్తువులు అందిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పౌర సరఫరాల సంస్థ కమిషనర్ వీరపాండ్యన్, కలెక్టర్ బీఆర్. అంబేడ్కర్, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, మార్కెటింగ్ శాఖ ఎ.డి బి.రవికిరణ్, డీఎస్ఓ మధుసూదన రావు, సివిల్ సప్లయిస్ డీఎం.మీనా, ఎస్టేట్ అధికారి చప్ప సతీష్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మీ రాక కోసం..!



టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. వంటనూనెల ధరలు సామాన్యులకు మంట పుట్టిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖల ఆధ్వర్యంలో కాస్త తగ్గింపు ధరలతో వంట నూనెల విక్రయ కేంద్రాన్ని ఆర్అండ్బీ జంక్షన్ దగ్గర గల రైతుబజార్లో ప్రారంభించడానికి శుక్రవారం ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 12:30 గంటలకు ప్రారంభించాలనేదీ షెడ్యూల్. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ 12:45 గంటలకు వచ్చారు. ఆ సమయానికే కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, పౌరసరఫరాల సంస్థ కమిషనర్ వీరపాండ్యన్ కూడా రైతుబజార్ వద్దకు చేరుకున్నారు. అయినా సరే విక్రయ కేంద్రాన్ని ప్రారంభించలేదు. గేటు వద్దే అంతా సుమారు పది నిమిషాల పాటు వేచిచూస్తూ ఉండిపోయారు. అంత వీఐపీ ఎవరా అనుకుంటున్నారా? మరెవరో కాదు విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు. సాధారణంగా ఎమ్మెల్యేలు ముందుగా వచ్చి మంత్రి కోసం ఎదురుచూస్తుంటారు. కానీ ఇక్కడ అంతా రివర్స్. మంత్రి ముందుగా వచ్చేసి ఎమ్మెల్యే కోసం ఎదురుచూడడం!

– సాక్షి ప్రతినిధి, విజయనగరం